

అయ్యప్ప గుట్ట కాలనీలో పేషెంట్ ఎక్స్‌రే పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# గుడ్ మార్నింగ్.. కోరుట్ల

- వినూత్న కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల శ్రీకారం
- పట్టణంలోని అయ్యప్ప గుట్టలో పర్యటన
- సమస్యలు తెలుసుకుంటూ.. పరిష్కారానికి ఆదేశాలు

కోరుట్ల, డిసెంబర్ 18 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సోమవారం 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఉదయం ప్రజా ప్రతినిదులు, మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని 20వ వార్డులో పర్యటించారు. చింతల వాడ, బీసీ కాలనీ, అయ్యప్పగుట్ట కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వారి చికిత్సకు సంబంధించిన ఎక్స్‌రే పత్రాలు, మందుల చీటీలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను, వాగ్దానాలను నెరవేర్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని అభయమిచ్చారు. ప్రతిరోజూ ఉదయం వేళలో గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఉదయం వేళ ఇంటికి వచ్చిన సంజయ్‌కి మహిళలు, అయ్యప్ప దీక్ష స్వాములు సాదర స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, కౌన్సిలర్లు గంధం గంగాధర్, పేర్ల సత్యం, మోర్తాడు లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బింగి సంతోష్, సత్యనారాయణ, ఆనంద్, ప్రభు పాల్గొన్నారు.

# అన్ని ప్రాంతాలకూ బస్సులు నడిపించాలి

- పాఠశాలల వేళలకు అనుకూలంగా వేయాలి
- అవసరమైన రూట్లలో అదనంగా ట్రిప్పులు పెంచాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఆర్టీసీ అధికారులతో సమీక్ష
- క్రిస్మస్ వేడుకలకూ హాజరు



క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, డిసెంబర్ 18 : మంథని నియోజకవర్గంలో బస్సులు లేని గ్రామాలన్నింటికీ బస్సులు వేయాలని, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అనుకూలంగా నడిపించాలని ఆర్టీసీ అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కరీంనగర్ ఆర్ఎం సుచరిత సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతి రోజూ 2 లక్షల 40 వేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారని, ప్రస్తుతం ఆ సంఖ్య 3 లక్షల 70 వేలకు పెరిగిందని, ఇందులో 60 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారని ఆర్ఎం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బస్సులు నడిపించాలన్నారు. వరుస సెలవులు వస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా బస్సులు పెంచాలన్నారు. అవసరమైన రూట్లలో ఆదనపు ట్రిప్పులు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సుపరిపాలన అందిస్తాం

ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా, మంత్రి క్రైస్తవులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ఇచ్చిన 6 గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ పాస్టర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు పాస్టర్ ఎలిషా, అధ్యక్షుడు శ్రీనువాస్ పాల్, సెక్రెటరీ పాస్టర్ కృపాకర్, కార్యదర్శి పాస్టర్ డేవిడ్ పాల్గొన్నారు.



దివ్యాంగుడు అనుముల మల్లయ్య దగ్గరి నుంచి అర్జీని స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

# మేమున్నాం

- ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడికి అదనపు కలెక్టర్ గౌతమి భరోసా

ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడు అనుముల మల్లయ్యది సిరిసిల్ల. వయస్సు 56 ఏండ్లు. అయితే కొన్నేండ్ల క్రితం మల్లయ్యకు ప్రభుత్వం ట్రై సైకిల్ అందజేసింది. ఇన్నాళ్లూ బాగానే నడిచిన ఆ సైకిల్, ఈ మధ్యే చెడిపోయింది. మరో కొత్త ట్రై సైకిల్ కోసం దరఖాస్తు పెట్టుకునేందుకు సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణి హాల్‌కు వచ్చాడు. అయితే మెట్లు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న మల్లయ్యను గమనించిన అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తన సీట్లోంచి లేచి వచ్చారు. మల్లయ్య సమస్యను తెలుసుకున్నారు. 'ఇది చాలా చిన్న సమస్యే. మేమున్నాం' అంటూ దరఖాస్తును స్వీకరించారు. మల్లయ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజ్యంను ఆదేశించారు.

– సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబర్ 18



సంఘటన స్థలంలో గాయపడిన అనిల్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

# విప్ అడ్లూరి మానవత్వం

- ప్రమాదంలో గాయపడ్డ యువకుడి చికిత్స ఖర్చు భరిస్తానని హామీ
- అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలింపు

ధర్మారం, డిసెంబర్ 18: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి చికిత్సకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని భరోసా ఇవ్వడంతోపాటు క్షతగాత్రుడిని కరీంనగర్‌లోని దవాఖానకు పంపించారు. వివరాలోకి వెళితే.. ధర్మారంలో సోమవారం నిర్వహించిన మల్లన్న దేవుడి పట్నాల ఉత్సవంలో పాల్గొనేందుకు విప్ లక్ష్మణ్ కుమార్ తన కాన్వాయ్ ద్వారా వస్తున్నారు. అయితే అప్పటికే ధర్మారం గ్రామానికి చెందిన కాల్వ అనిల్ అనే యువకుడు పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాలుకు తీవ్ర గాయమైంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న లక్ష్మణ్ కుమార్ వారిని చూసి తన క్వానాయ్‌ని ఆపారు. యువకుడి వద్దకు వెళ్లారు. అంబులెన్స్‌ను రప్పించారు. చికిత్సకు అయ్యే ఖర్చు తానేభరిస్తానని భరోసా ఇచ్చి యువకుడిని కరీంనగర్‌లోని దవాఖానకు పంపించారు.



మల్లన్న ఆలయం చుట్టు బోనాలతో ప్రదక్షణ చేస్తున్న భక్తులు

# వైభవంగా మల్లన్న జాతర

గొల్లపల్లి, డిసెంబర్ 18: మల్లన్నపేట శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు సోమవారం వైభంగా ప్రారంభమయ్యాయి. మార్గశిర శుద్ధ పంచమి తర్వాత వచ్చే షష్ఠి రోజున మహాదండివారంతో జాతర ఉత్సవాలు మొదలుకాగా, జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పట్నాల మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా ధర్మపురి సీఐ రాంమూర్తి, గొల్లపల్లి, ధర్మపురి ఎస్ఐలు నరేశ్, దత్తాద్రి బందోబస్తు నిర్వహించారు. కాగా, స్వామివారిని సుమారుగా 12 వేల మంది దర్శించుకున్నారని, ఆలయానికి ₹74,480 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య తెలిపారు.



దర్శనంకు బారులు తీరిన భక్తులు



కరీంనగర్‌లోని రామేశ్వరాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితుడు రఘురామశర్మ, అర్చకులు

# వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలు

కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ, డిసెంబర్ 18: నగరంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలను భక్తులు వైభవంగా జరుపుకొన్నారు. ఈ క్రమంలో పాత బజార్‌లోని గౌరీ శంకరాలయం, కమాన్ రోడ్‌లోని రామేశ్వరాలయం, భగత్‌నగర్‌లోని అంజనాద్రి, అయ్యప్ప ఆలయాలు, చైతన్యపురి కాలనీలోని మహాశక్తి ఆలయం, బొమ్మకల్‌లోని యజ్ఞవరాహస్వామి ఆలయం, రాంపూర్‌లోని గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి, అనంత నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, కమాన్ రోడ్‌లోని రామేశ్వరాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని వేదపండితుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో అర్చకులు కనుల పండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.



స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు